క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

రెడ్డిగూడెం: మండలంలోని నాగులూరు గ్రామంలో బుధవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష

నూజివీడు: ఈనెల 30వ తేదీ నుంచి నవంబరు ఒకటో తేదీ వరకు నూజివీడు మండలంలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీఏ విజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

నేడు ఉపాధి హామీ తనిఖీలపై ప్రజావేదిక

ముసునూరు: 2022–2023 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి హామీ పనుల తనిఖీపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. మంగళవారం ఆమె వివరాలు వెల్లడించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గత ఆర్థిక సంవత్సరం మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై తనిఖీలు పూర్తయ్యాయని, దీనిపై ప్రజావేదిక కార్యక్రమం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని ఆమె కోరారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

గంపలగూడెం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి కూడా మెరుగైన ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. క్రీడల్లో పోటీ స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. అండర్–14 విభాగంలో తొమ్మిది రకాల క్రీడాలను మండల స్థాయిలో బాలురు, బాలికలకు నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎం. కొండలరావు, బి. జమలయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు గుర్రం గోపాలరావు పాల్గొన్నారు.

గృహసారథులకు బీమా నమోదు



తిరువూరు: పట్టణంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వైఎస్సార్ సీపీ కల్పించిన ఉచిత బీమా నమోదు కార్యక్రమాన్ని స్థానిక 1వ సచివాలయంలో మంగళవారం ప్రారంభించారు. కన్వీనర్లు, గృహసారథులు ఈ ఉచిత ఇన్సూరెన్సు పథకంలో చేరాలని జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఏరువ ప్రకాష్‌రెడ్డి కోరారు. ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు ఫొటోతో ఉచిత బీమా పథకానికి ఆన్‌లైన్ యాప్‌లో పేర్లు నమోదు చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వెలుగోటి ఆదినారాయణ, సురేష్ పాల్గొన్నారు.

పట్టపగలు చోరీ

తిరువూరు: తిరువూరు శాంతినగర్‌లో ఒక నివాసగృహంలో మంగళవారం ఉదయం చోరీ జరిగింది. పెళ్లి శుభలేఖ ఇచ్చే నెపంతో ఇంట్లోకి ప్రవేశించిన ఇరువురు దుండగులు మహిళపై దౌర్జన్యం చేసి బంగారు గొలుసుతో ఉడాయించారు. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల మేరకు బోయపాటి వీరయ్య నివాసంలో ఆయన భార్య ఉమా ఒంటరిగా ఉండటం గమనించిన ఇరువురు యువకులు శుభలేఖ ఇవ్వాలని లోనికి ప్రవేశించారు. హఠాత్తుగా ఉమపై దాడిచేసి బంగారు ఆభరణాలు ఎక్కడున్నాయో చెప్పాలంటూ కొట్టి ఆమె వద్ద ఉన్న మూడు కాసుల బంగారు గొలుసును తస్కరించి ఉడాయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నూజివీడు: వాహనచోదకులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్‌ను ధరించి వాహనాన్ని నడపాలని రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని మొర్సపూడి వద్ద మంగళవారం ఆయన తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు, వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యం

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



అదనపు ఆర్థికసాయం చెక్కులను అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

జి.కొండూరు: పేదలకు సొంతింటి కలను సాకారం చేసి, వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధి చెర్వు మాధవరం, కవులూరు గ్రామాలలోని ఎస్టీలకు పక్కా గృహాలను నిర్మించేందుకు ప్రభుత్వం ఇస్తున్న ఆర్థికసాయంతో పాటు అదనంగా ఎస్టీ కార్పొరేషన్ నుంచి ఒక్కొక్కరికి రూ.63వేల చొప్పున 22మందికి ఎమ్మెల్యే మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన చెక్కులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్టీలకు మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నుంచి ఒక్కొక్కరికీ అదనంగా మరో రూ.10వేలను అందిస్తున్నట్లు ప్రకటించారు. అంతే కాకుండా అవసరమైన వారికి కేడీసీసీ బ్యాంకు నుంచి రూ.2 లక్షల వరకు రుణాలను మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా నియోజకవర్గంలో ఉన్న మరికొంతమంది లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహాన్ని సద్వినియోగపరుచుకుని ఎస్టీలు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ కోసమే 'జగనన్న ఆరోగ్య సురక్ష'

జి.కొండూరు: ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధిలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం షెడ్యూల్‌ను ఎమ్మెల్యే మంగళవారం విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలను గుర్తించడం, వ్యాధులపై అవగాహన కల్పించడం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, ఉచితంగా వైద్య పరీక్షలు, చికిత్స అందించడం, మందుల పంపిణీ వంటి కార్యక్రమాలను చేపడతారని పేర్కొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వసంత

పార్టీలకతీతంగా లంకభూముల పట్టాలు

ఇబ్రహీంపట్నం: పార్టీలు, కులమతాలకతీతంగా లంక భూములకు పట్టాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో వివిధ గ్రామాల లంకభూముల సాగుదారులు ఎమ్మెల్యే వసంతను మంగళవారం కలిసి భూములకు పట్టాలు మంజూరు చేయించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హక్కు కల్పించే నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పట్టా ఇచ్చేలా చూడాలని మండల తహసీల్దార్ శ్రీనివాసరావుకు సూచించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ మునగాల సాంబశివారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, దుర్గగుడి కమిటీ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంద్రకొండ గురవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు లంకే అంకమోహనరావు, దయాకర్, చిన్నయ్య, బాణావత్ బాలాజీ, పండు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

ఇబ్రహీంపట్నం: విధి నిర్వహణలో ప్రజలకు అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచించారు. ఇటీవల రెడ్డిగూడెం ఈఓపీఆర్డీగా బాధ్యతలు స్వీకరించిన బి.శ్రీనివాసరావు ఐతవరంలోని నివాసంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛం అదజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వసంత ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వర్షపునీరు తరలింపునకు వినతి

ప్రసాద్‌నగర్‌లో వర్షపునీరు తరలింపునకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు విన్నవించారు. నీరు తరలింపునకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. జాకీర్‌హుస్సేన్ కళాశాల ప్రిన్సిపాల్ మహబాషా, సీఐటీయూ నాయకులు మహేష్, విఠల్‌రావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వసంతను మర్యాదపూర్వకంగా కలిసిన ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

నూజివీడు: మండలంలోని పల్లెర్లమూడి హైస్కూల్లో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలుర ఆటల పోటీలను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించారు. ఇందులో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్, త్రోబాల్, యోగా పోటీలు నిర్వహించినట్లు హెచ్‌ఎం హనుమంతరావు పేర్కొన్నారు. ఆటల పోటీల నిర్వహణకు ఉప్పలపాటి వెంకటేశ్వరరావు, బెజవాడ శ్రీనివాసరావు, బాషా, దావులూరి కృష్ణమోహన్, అట్లూరి శ్రీనివాసరావు తమ సహకారాన్ని అందించారు. హెచ్‌ఎం హనుమంతరావు, విద్యా కమిటీ చైర్మన్ సుందరం, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నూజివీడు మండల స్థాయిలో సెలెక్ట్ అయిన క్రీడాకారులు ముసునూరు జెడ్పీ హైస్కూల్లో జరిగే నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

ఆటల పోటీలు ప్రారంభం

ఏ.కొండూరు: మండలంలోని కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆటల పోటీలను ఎంపీటీసీ సభ్యుడు పుల్లారావు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు చెన్నారావు మంగళవారం ప్రారంభించారు. ఎంఈఓ–2 కేశవరావు, హెచ్‌ఎం ఆదిశేషు, ఎస్‌ఎంసీ చైర్మన్ కే వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్, పీడీలు కనకారావు, గోపి పాల్గొన్నారు.

కుక్కలు బాబోయ్..!

మైలవరం: మైలవరంలో కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు భయాందోళన చెందుతున్నారు. పలుచోట్ల వాహనాల మీద వెళుతుంటే కుక్కలు వెంటపడుతున్నాయి. ఈ విషయంపై పలుమార్లు గ్రామస్తులు పంచాయతీ అధికారులకు తెలియజేసినా వారి నుంచి ఎటువంటి స్పందన రావడం లేదని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రామకృష్ణ కాలనీలో వీధి కుక్కల స్వైర విహారం

హీల్ ప్యారడైజ్‌లో అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ కోర్సు

నూజివీడు: ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ స్కూల్లో నిర్వహిస్తున్న అలేఖ్య హీల్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 2023–24 ఏడాదికి అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ కోర్సు (యాప్ డెవలప్‌మెంట్, డిజిటల్ కంటెంట్ ఎంగేజ్‌మెంట్, ఏఐ కోర్సు)లో ప్రవేశానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు హీల్ సంస్థ సీఈఓ కే అజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. హీల్ ప్యారడైజ్‌లో ఈ నెల 20న నిర్వహించే రాతపరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఉచితంగా కోర్సులో శిక్షణ, ఉపాధి కల్పిస్తామన్నారు. అనాథ పిల్లలు, తల్లిదండ్రుల్లో ఒకరు లేని పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలు కనీసం 12వ తరగతి, డిగ్రీ కంప్యూటర్, ఇంజినీరింగ్ కంప్యూటర్ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 91000 24435లో సంప్రదించాలని కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ముసునూరు: క్రీడలతో దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంఈఓ బీవీ సుబ్బారావు పేర్కొన్నారు. ముసునూరు హైస్కూల్లో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల ఇన్‌చార్జ్ మహ్మద్ ఆలీ ఖాన్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ హెచ్.ఎం వాణీకుమారి అధ్యక్షతన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం మండలంలోని వివిధ పాఠశాలల నుంచి హాజరైన 250 మంది అండర్–14, అండర్–17 బాల బాలికలకు ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, షటిల్, బాల్ బాడ్మింటన్, టెన్నీకాయిట్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచి, ఎంపికైన వారికి ఈనెల 14, 15 తేదీలో నియోజకవర్గ స్థాయి పోటీలను ముసునూరు హైస్కూల్లో నిర్వహిస్తారని పీడీ వివరించారు. ఈ కార్యక్రమాల్లో పీడీలు హేమ, సుకుమార్, వాకా నాగరాజు, నాగమల్లేశ్వరి, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడా పోటీల కోర్టులను ప్రారంభిస్తున్న ఎంఈఓ సుబ్బారావు తదితరులు

నూతన పింఛన్లు అందజేత


రెడ్డిగూడెం: మండలంలోని ఓబులాపురంలో నూతనంగా మంజూరైన కొత్త పింఛన్లను సర్పంచ్ నూనె అప్పిరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జగనన్న ప్రభుత్వంలో ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలిపారు.

తిరువూరుకు ఎస్‌ఎఫ్ఐ సైకిల్ యాత్ర



తిరువూరు: ఎన్టీఆర్ జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలల పరిశీలనకు భారత విద్యార్థి ఫెడరేషన్ చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం తిరువూరు చేరింది. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన తిరువూరులో ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు కోరారు. ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్ నాయక్, తిరువూరు పట్టణ నాయకులు మోహన్, శిరీష పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ అధికారిగా రవిప్రసాద్



నూజివీడు: నూజివీడు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారిగా రావి రవిప్రసాద్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కైకలూరు నుంచి ఆయన ఉద్యోగోన్నతిపై నూజివీడు ఏబీసీడబ్ల్యూఓగా నియమితులయ్యారు. రవిప్రసాద్‌ను వసతి గృహ సంక్షేమ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

ఈఓపీఆర్డీగా పరమాత్మ



ఏ.కొండూరు: ఏ.కొండూరు మండల ఈఓపీఆర్డీగా ఎంఎస్‌కే పరమాత్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఉయ్యూరు మండలం ఆకునూరు పంచాయతీ గ్రేట్ వన్ ఈఓగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై ఈఓపీఆర్డీగా ఏ.కొండూరులో నియమితులయ్యారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలి



దీక్ష చేస్తున్న మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు

నూజివీడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈనెల 18 నుంచి 22 వరకు నిర్వహించే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కంకట వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ నూజివీడులో నిర్వహిస్తున్న రిలేదీక్షలు మంగళవారం నాటికి నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరగకపోవడం వల్ల దశాబ్దాల కాలంగా ఎస్సీలలో ముఖ్యంగా మాదిగలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఈ అన్యాయాన్ని సరిచేయాలంటే తప్పనసరిగా ఎస్సీ వర్గీకరణే శరణ్యమన్నారు. ఏలూరు జిల్లా కోకన్వీనర్ తొమ్మండ్రు రుద్రయ్య, ఎంఎస్పీ నూజివీడు నియోజకవర్గ కో–కన్వీనర్లు వెంపటి వెంకటేశ్వరరావు, కలపాల విలియమ్స్, ముళ్లపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ కార్యాలయంలో తిరువూరు డివిజన్ విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడారు. ఓల్టేజీ హెచ్చుతగ్గులు, అనధికారిక కోతల నివారణకు చర్యలు తీసుకోవాలని, వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం కలిగించవద్దని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే ముందుగా ప్రకటించి సరఫరా నిలిపివేయాలని సూచించారు. ఎస్సీ కాలనీలు, జగనన్న కాలనీలలో కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుత్ సరఫరా మెరుగునకు సూచనలిచ్చారు. తిరువూరు ఏడీఈ రామకృష్ణ, తిరువూరు, విస్సన్నపేట, ఏకొండూరు, గంపలగూడెం మండలాల విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



విద్యుత్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

మాదిగ ద్రోహి మంద కృష్ణ మాదిగ

ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ వైఎస్ రాజు మాదిగ

జి.కొండూరు: అవినీతి అనకొండ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ రాష్ట్ర బంద్‌కు మద్దతు తెలిపిన మంద కృష్ణమాదిగ, మాదిగ జాతికే ద్రోహం చేశాడని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ వైఎస్ రాజు మాదిగ మండిపడ్డారు.

నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న 2014–19 మధ్యకాలంలో మంద కృష్ణ మాదిగను రాష్ట్రంలో అడుగు పెట్టనీయలేదని గుర్తు చేశారు. అయినప్పటికీ చంద్రబాబుకు మద్దతు తెలపడం సిగ్గుచేటన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికలలో మాదిగలంతా నోటాకు ఓటు వేయాలని పిలుపునిచ్చిన మంద కృష్ణ మాదిగ, ఇప్పుడు అవినీతి చేసి జైలుకుపోయిన చంద్రబాబుకు మద్దతు తెలపడంపై మాదిగలంతా జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఇకనైనా మందా కృష్ణమాదిగ తన తీరును మార్చుకోవాలని, లేదంటే మాదిగ జాతిలో ఆయన చరిత్రహీనుడిగా మిగిలిపోతారని హితవు పలికారు.

కోడూరులో జగనన్న పాలవెల్లువ రుణమేళా



కోడూరులో నిర్వహించిన రుణమేళాకు హాజరైన మహిళలు



రెడ్డిగూడెంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ విజయభాస్కరరెడ్డి

జి.కొండూరు: మండలంలోని కోడూరులో జగనన్న పాల వెల్లువ రుణ మేళాను సర్పంచ్ వంగూరు ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమూల్ డెయిరీకి పాలు ఉత్పత్తి చేస్తున్న వారికి అందించే ప్రోత్సాహకాలు, పాల ఉత్పత్తిని పెంచేందుకు చేపడుతున్న చర్యలపై అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం పాడి పశువుల కొనుగోలు నిమిత్తం రుణాల కావాల్సిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామారావు, వెలగలేరు పశు వైద్యాధికారి మురళీకృష్ణారెడ్డి, రూట్ ఇన్‌చార్జి అంజయ్య, వెలుగు ఏపీఎం రాధాకృష్ణ, కేడీసీసీ జి.కొండూరు బ్రాంచి సూపర్‌వైజర్ పణిబాబు, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం రైతు భరోసా కేంద్రంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ పాడి రైతుల ప్రయోజనం కోసం చేపట్టిన సహకార డెయిరీ రంగం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. జగనన్న పాల వెల్లువవల్ల మహిళ పాడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, ఎంపీటీసీ సభ్యుడు కుప్పిరెడ్డి వర ప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్, బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు అవకాశాలు

మైలవరం: నైపుణ్యం కలిగిన ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు ఉత్తేజకరమైన కెరియర్ అవకాశాలు ఉన్నాయని బెంగళూరు ఎంబెడెడ్ ఐఓటీ ప్రతినిధి డాక్టర్ ఎస్ మాధవ్ పాండియన్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ, టెస్సాల్వ్ సెమీ కండక్టర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎంబెడెడ్ ఐఓటీ, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ అనే అంశంపై వర్క్‌షాపు మంగళవారం నుంచి వారం రోజులు జరుగుతుంది. సదస్సుకు మాధవ్ పాండియన్, వీఎల్‌ఎస్ఐ టెస్సాల్వ్ సెమీ కండక్టర్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి నెపోలియన్‌లు రిసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరిస్తున్నారు. డాక్టర్ మాధవ్ పాండియన్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల పరిశ్రమల్లో నైపుణ్యం ఉన్న ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్లకు మంచి డిమాండ్ ఉందని, ఎంబెడెడ్ ఐఓటీలో నైపుణ్యం కలిగిన ఎలక్ట్రిక్ ఇంజినీర్లకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరినాథరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు ఎక్కువ డిమాండ్ ఉందని, దీనికి నైపుణ్యం ఉన్న ఇంజినీర్‌లు అవసరమన్నారు. విద్యార్థులు వారం రోజులు జరిగే వర్క్ షాపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ జే శివవరప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమానికి పీ దీపక్‌రెడ్డి, కే లక్ష్మీ లావణ్య కో–ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న డాక్టర్ మాధవ్ పాండియన్, నెపోలియన్, హరినాథరెడ్డి తదితరులు

వీనులవిందుగా హరికథా మహోత్సవాలు

విజయవాడ కల్చరల్: హరికథా పితామహుడు ఆదిభట్లనారాయదాసు 159వ జయంతి సందర్భంగా ఆయన శిష్యప్రశిష్యులు సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండపంలో నిర్వహిస్తున్న హరికథా మహోత్సవాలు భక్తిరస ప్రధానంగా సాగుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన హరికథా భాగవతార్‌లు గురుభక్తిని చాటుకుంటున్నారు. మంగళవారం నాటి కార్యక్రమంలో కర్నూలుకు చెందిన పి. రవిప్రసాద్ భక్తమయూరధ్వజ, తిరుపతికి చెందిన షణ్ముఖి భాగవతారాణి మహిషాసుర మర్దని, పి. విజయకుమార భాగవతారిణి సుందరా కాండ, హైదరాబాద్‌కు చెందిన పడాల కల్యాణి వల్లీకల్యాణం కథను గానం చేశారు. కార్యక్రమంలో వాయిద్యకళాకారులు అమ్ముల ప్రసాద్, పాణ్యం దక్షిణామూర్తి, పాలపర్తి ఆంజనేయులు పాల్గొన్నారు. కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. బుధవారం నాటితో హరికథా ఉత్సవాలు ముగుస్తాయని కన్వీనర్ బుర్రా పద్మనాభ శాస్త్రి వివరించారు.

18 నుంచి 26 వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 18వ తేదీ నుంచి 26వ తేదీ వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలు శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18వ తేదీన స్వామివారిని విశేషంగా పసుపు, 19న కుంకుమ, 20న గంధం, 21న సింధూరం, 22న గంధం, 23న విభూతి, 24న తమలపాకులు, 25న స్వామివారి నిజరూపదర్శనం 26న గరిక పూలుతో విజయ గణపతి స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు జరుగుతాయని, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.